# సౌకర్యాలు నిల్.. అపరిశుభ్రత ఫుల్

- అధ్వానంగా తాడికొండ ఆర్టీసీ బస్టాండ్
- లోపలకు రాని బస్సులు, కల్పించని సౌకర్యాలు
- మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- తీర్మానం చేసిన స్థలం వెనక్కి తీసుకుంటామంటున్న పంచాయతీ

**తాడికొండ:** తాడికొండ బస్టాండ్ అధ్వానంగా మా రింది. కనీస సౌకర్యాలు లేక, బస్సులు రాక, ప్ర యాణికులు ఉండ లేక కునారిల్లుతోంది. ఆదా యంపై ఉన్న దృష్టి ఆర్టీసీ అధికారులకు సౌక ర్యాల కల్పనలో లేదని ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నా రు. గ్రామ జనాభాకు తగ్గట్లు అప్పట్లో బస్సు సౌక ర్యం కల్పించడం లేదని నాటి ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా సర్పంచ్‌గా ఉన్న సమయంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. బస్టాండ్ నిర్మాణం కోసం స్థలం కావాలని అధికారులు అడగడంతో పాలక వర్గ ద్వారా పంచాయతీకి చెందిన 30 సెంట్ల భూమిని కేటాయించారు.


ఎలాంటి సౌకర్యాలు లేకుండా నిరుపయోగంగా ఉన్న తాడికొండ ఆర్టీసీ బస్టాండ్

### నిర్వహణ గాలికి

బస్టాండ్ నిర్వహణ నిమిత్తం ప్రత్యేకంగా సిబ్బం దిని నియమించక పోవడంతో ఆర్టీసీ బస్సులు లోపల నిలుపుదల చేయడం లేదు. బయటే నుం చే అలా వచ్చి, వెళ్లిపోతున్నాయి. గతంలో తాడికొండ వరకు కట్ జర్నీ బస్సులు నడిచేవి. దీని ద్వారా తుళ్లూరు నుంచి వచ్చే బస్సులపై ఆధారపడకుండా నేరుగా తాడికొండ నుంచి గం టకో బస్సు సర్వీసు అందుబాటులో ఉండేది. కొంత ప్రయాణ ఇబ్బందులు తొలగాయి. ఇప్పుడు పూర్తిగా బస్సు సర్వీసులు తుళ్లూరు నుంచి మాత్రమే నడుస్తుండటంతో రాజధాని ప్రాంతానికి వెళ్లే కిక్కిరిసిన బస్సుల్లోనే విద్యా ర్థులు, ఉద్యోగులు వేళాడుతూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

### ప్రయివేటు వాహనాలే దిక్కు

తాడికొండ నుంచి మంగళగిరికి రెండు ప్రయి వేటు బస్సులు, పది ఆటోలు నిత్యం తిరుగుతు న్నాయి. ఆర్టీసీ మాత్రం ఒక్క బస్సు సర్వీసును కూడా నడపలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇక శివారు గ్రామం బడేపురానికి గతంలో ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేది. ఇప్పుడా సౌకర్యం లేని కారణం గా ద్విచక్ర వాహనాలను ఆశ్రయించి బస్సుల కోసం రావాల్సిన పరిస్థితి నెలకొంది.

### అరకొరగా నిర్మాణం


కుంగిన ఫ్లోరింగ్

దాదాపు 36 వేల జనాభా ఉన్న తాడికొండ గ్రామం నుంచి నిత్యం 10 వేల మంది కళా శాలలు, వ్యాపారాలు, ఉద్యోగాల నిమిత్తం గుంటూరుకు వెళ్తుంటారు. వీరిలో కూలీలు, ఉద్యోగులే అధికం. వీరందరికీ తగిన బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తులు కోరడం.. అరకొర వసతులతో బస్టాండ్ నిర్మించి, వదిలేశారు. ప్రయాణికులకు తగిన మరుగుదొడ్లు, తాగు నీరు, విద్యుత్ వసతి, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు కూడా కల్పిం చలేదు. అప్పట్లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన టెలివిజన్ కూడా పూర్తిగా పాడైపోయింది.

### డంపింగ్ యార్డులా దుర్వాసన

బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. చెత్తతో నిండిపోయి దుర్వా సన వెదజల్లుతోంది. మరుగుదొడ్లు లేకపోవడంతో బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండటంతో ముక్కుపుటలు పగిలిపోతున్నాయి. బస్టాండ్ లోప లికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఆటోలకు పార్కిం గ్ స్థలంగా మారిపోయింది. ఇక బస్టాండ్ లోపల ఫ్లోరింగ్ పూర్తిగా కుంగిపోయి, మందుబాబులకు అడ్డాగా మారింది. ఆకతాయిలు నిత్యం అక్కడే మద్యం తాగి సీసాలు, గ్లాసులు పడవేస్తున్నారు. పాన్‌లతో గోడలపై ఉమ్మి అధ్వానంగా తయారు చేస్తున్నారు. సంబంధిత అధికారులకు సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖ లాలు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.30 కోట్ల విలువైన స్థలాన్ని తాము వెనక్కి తీసుకొని, గ్రామ అవసరాలకు వినియోగి స్తామని పంచాయతీ పాలకవర్గం చెబుతోంది. ఈ మేరకు త్వరలో పంచాయతీ పాలకవర్గ తీర్మానం చేయనున్నట్లు సర్పంచ్ తోకల సరోజిని తెలిపారు.


ఆవరణలో చేరిన చెత్తకుప్పలు, ఆటోలు

### నిరుపయోగంగా మార్చారు

ఆర్టీసీకి రూ.కోట్లు విలువైన భూమిని ఇస్తే.. బందుల దొడ్డిగా మార్చారు. ప్రతి నిత్యం పంచా యతీయే చెత్త నిర్వహణ చేపడుతోంది. కానీ, మరుగుదొడ్లు లేని కారణంగా మూత్ర విసర్జనతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆర్టీసీకి ఇచ్చిన స్థలాన్ని వెనక్కి తీసుకునేందుకు త్వరలో పాలకవర్గ తీర్మానం చేసి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

– తోకల సరోజినీ, సర్పంచ్ తాడికొండ

## క్లుప్తంగా

### శోధన ద్వారా దేవుడి మెప్పు పొందవచ్చు



**ఫిరంగిపురం:** శోధన ద్వారా దేవుడి మెప్పును పొందవచ్చని విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో తపస్సుకాల మొదటి ఆదివారం దివ్యబలి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ ప్రతి మానవుడు తపస్సు కాల దినాల్లో దీక్షతీసుకొని ప్రతి రోజు భగవంతుడిని ప్రార్థన చేయాలని చెప్పారు. దీక్ష ద్వారా శోధించబడతాడని దానిద్వారా పవిత్రుడవుతాడన్నారు. 40 దినాల్లో మంచికార్యాలు, ప్రార్థన, దానధర్మాలు వంటివి చేయడం ద్వారా పరిశుద్ధుడవుతాడని తెలిపారు. అనంతరం దివ్య పూజాబలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ విచారణగురువు రవీంద్ర, మఠకన్య స్త్రీలు, గుడిపెద్దలు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**తాడేపల్లిరూరల్ :** విద్య, ఐటీ శాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, ఎస్కే బాష, హగ్గయ్య, దానయ్య, ఆశీర్వాదం, నవనీతం, విజయశ్రీ, రిబ్కా పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవాలు



**దుగ్గిరాల:** దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మూడు రోజు ఉత్సవాలు ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో సుప్రభాత సేవ, నవనీత హారతి, నిత్య కైంకర్యాలు, నవకుంభారాధన, నరసింహ హోమం, సాయంత్రం నిత్య హోమం, ఆలయ బలిహారణ జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్రలు పర్యవేక్షించారు.

### విద్యుత్ పునరుద్ధరణ

**దుగ్గిరాల:** మండలం లోని పేరుకలపూడి పశు వైద్యశాలలో అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందిచారు. దుగ్గిరాల విద్యుత్ శాఖకు బకాయి గురించి వివరణతో లేఖ పంపగా వారు సానుకూలంగా స్పందించారు. విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించినట్లు పశు వైద్యశాల వైద్య అధికారి కె.వి.వెంకట సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### చిరువ్యాపారి మృతి



**దుగ్గిరాల:** మండలంలోని ఈమని గ్రామానికి చెందిన పులివర్తి సురేష్ (45) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. అరటి గెలలు పెట్టుకుని పరిసర ప్రాంతంలో అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న అతను మధ్యాహ్నం దుగ్గిరాల పోస్టాఫీసు సమీపన ఉన్న బస్‌షెల్టర్‌లో మృతి చెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

### సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు



**తెనాలిటౌన్:** బాలాజీరావుపేట అయ్యప్పపురం ప్రధాన అయ్యప్ప దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో దుర్ప హరిబాబు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

## నేడు యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

**మంగళగిరి టౌన్ :** నగర పరిధిలోని ఆత్మకూరులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ సోమవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 5న తల పెట్టిన ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చి 12వ తేదీకి వాయిదా పడిందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల అధ్యక్షులు హాజరు కావాలని తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



**మంగళగిరి టౌన్ :** అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని మంగళగిరి పట్టణ సీఐ డి.వినోద్‌కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రాత్రి 10 గంటల తరువాత రౌడీషీటర్లు వీధుల్లో తిరిగినా, అనుమాస్పదంగా కనిపించినా వారిని విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు. నేర ప్రవృత్తి మార్చుకోకుండా వ్యవహరించే వారిపై పిడియాక్ట్ పెడతామని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐలు రవీంద్రనాయక్, హరిబాబు, క్రైం సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, శ్రీరామ్ ఉన్నారు.

## వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

మంగళగిరి పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

**మంగళగిరి:** వైఎస్సార్ సీపీని బలోపేతం చేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2029లో ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా కష్టపడాలని మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం దుగ్గిరాల మండలం గొడవర్రు, శృంగారపురం కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ మోసకారి చంద్రబాబు 2024లో తన మోసపు హామీలతో నమ్మించి, ఓట్లేయించుకున్నారన్నారు.


కార్యకర్తలతో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

చంద్రబాబు చేసిన మోసాలను ప్రతి గ్రామంలో ఇంటింటికీ తీసుకెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యకర్తలు, నాయకులు తప్పుడు కేసులు పెట్టి వేధించడం అధికార పార్టీ మానుకోవాలని హితవు పలికారు.

## కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి రైతులను కాపాడాలి

**మంగళగిరి టౌన్ :** భారత దేశ రైతాంగాన్ని కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతులకు చట్టబద్ధత చేసి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ చట్టం రైతుల మెడకు ఉరితాడులా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని అప్పగించడానికి వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా నేడు సంయుక్త కిసాన్ ఆధ్వర్యంలో అన్ని రైతుల సంఘాలు రాష్ట్ర వ్యవసాయ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. నేడు జరిగే ధర్నాకు రైతులు, కౌలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక కూలీ, రైతు సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివాజీ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రామిరెడ్డి పాల్గొన్నారు.


ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

## మతోన్మాద రాజకీయాలను తరిమికొడదాం

**మంగళగిరి టౌన్ :** మతోన్మాద రాజకీయాలను దేశం నుండి తరిమికొడదామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ దేశంలో ఎన్‌డీఏ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతం పేరుతో ప్రజలను విడదీసి వివాదాలు సృష్టించడానికి ప్రయతిస్తోందన్నారు. ఈ విధానాల వల్ల లౌకిక ప్రజాతంత్ర వాదానికి దేశంలో పెను ప్రమాదం పొంచి వుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

## మహాయజ్ఞం పూర్ణాహుతి ప్రారంభం

**తెనాలి:** స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం ఘనంగా ఆరంభమైంది. స్థానిక తాలూకా హైస్కూలు గ్రౌండ్‌లో ఆరురోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. రాష్ట్రంలోనూ, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పూర్తిచేసిన 108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలను ప్రత్యేక వాహనంపై ఉంచి శోభాయాత్రను శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుండి బయలుదేరింది. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి జరిగే తెనాలి తాలూకా హైస్కూలు మైదానంలోని వేదిక వరకు శోభాయాత్ర సాగింది. అక్కడ సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహం, దీక్షాధారణ, అంకురారోపణను వైఖానసాగమోక్తంగా జరిపారు. సోమవారం ఉదయం ఆరుగంటలకు గోపూజతో వేడుకలు ఆరంభమవుతాయనీ, శ్రీసీతారాములకు పంచామృత స్నపన తదుపరి ఉదయం 10 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. భక్తజనులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. 11.30కు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తిచే ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం 6.45 గంటలకు అవధాన సరస్వతీపీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని వివరించారు. శోభాయాత్రలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్ రెడ్డి, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్ కుమార్, కల్లూరి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలకు ప్రత్యేక వాహనంలో శోభాయాత్ర

## నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**ఫిరంగిపురం:** మండలంలోని కంద్రిక శివారు రేగులగడ్డలో సీతారామ దేవాలయ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో జెక్కా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వందేళ్ల నాటి ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల తొలగించారని పేర్కొన్నారు. దేవదాయ శాఖ తరుపున రూ.80లక్షలు, ధర్మకర్త తరుపున రూ.40 లక్షలు మొత్తం రూ.1.20కోట్లతో నూతన దేవాలయ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11.28గంటలకు శంకుస్థాపన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు, ఎండోమెంటు అధికారులు, వ్యవస్థాపక ఆలయ ధర్మకర్త గన్రాజు లక్ష్మీకాంత్ పాల్గొంటారని తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కు అందజేత



**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ కుంచనపల్లికి చెందిన ఓ బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును టీడీపీ నాయకులు ఆదివారం అందజేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు కానుగొలను కోటేశ్వరరావు మాట్లాడుతూ గంధం ఉమామహేశ్వరికి రూ. 65 వేలు చెక్కును అందజేశామని తెలిపారు. టీడీపీ నాయకులు దాసెట్టి అరుణ, జనసేన నాయకులు పసుపులేటి అశోక్, కొవ్వూరు సురేష్ పాల్గొన్నారు.

## యువకుడిపై దాడి

**తెనాలిరూరల్:** తీన్‌మార్ కొడుతున్న యువకుడిపై ఇద్దరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన నరసింహ తీన్‌మార్ కొడుతుంటాడు. ఆదివారం ఓ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతుండగా రామలింగేశ్వరపేటలోని రైస్‌మిల్లు సమీపంలో తీన్‌మార్ ఆపాలంటూ జూపల్లి వంశీ, ప్రమోద్ నరసింహతో వాదనకు దిగారు. అంతటితో ఆగకుండా రాయితో అతనిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పార్లమెంటు సీట్లు పెరిగేలా కృషి చేయాలి

**తెనాలిఅర్బన్:** పార్లమెంట్ స్థానాల పునర్విభజనలో రాష్ట్రానికి ఎక్కువ సీట్లు వచ్చేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు. మారీసుపేటలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తెనాలి పార్లమెంట్ స్థానంతోపాటు దుగ్గిరాల, కుచినపూడి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవని గుర్తు చేశారు. గతంలో జరిగిన పునర్విభజనలో కనుమరుగు అయినట్లు చెప్పారు. మళ్లీ ఇప్పుడు ఆ స్థానాలన్నీ వచ్చేలా చూడాలని కోరారు.

టీడీపీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యపక్షంగా ఉందని, సీఎం చంద్రబాబు దీనికోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పొన్నూరు నాగ సూర్యశశిధరరావు, కర్లపూడి బుల్లయ్య, గుర్రపు ద్వారక శ్రీనివాస్, మాదాల పూర్ణచంద్రబాబు, పెనుగొండ శివకుమార్, రాయప్ప, కె.కోటేశ్వరరావు, అయ్యప్ప, కార్తీక్, అఖిల్, మల్లిఖార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**తాడేపల్లిరూరల్ :** తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్‌లో లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ వైద్యులు జి. గంగాధరరావు, ఆర్. జ్యోతి ప్రకాష్ రెడ్డి, కె.సాయి హితీష్, అనూష, అచ్యుతబాబు, రామకృష్ణ, నాగమాన్య, రంగనాథ్, జ్యోతి అభిషేక్, రవితేజ, కోమలి, అపూర్వ వైద్య సేవలను అందించారని తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కిడ్నీ అల్ట్రా సౌండ్ స్క్రీనింగ్, గుండె ఈసీజీ, ఎకో స్కానింగ్, కంటి సంబంధిత పరీక్షలు, మోకాలు, వెన్నుముకకు సంబంధించిన పరీక్షలు, మహిళా సంబంధిత వ్యాధులకు, అన్ని రకాల జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారని చెప్పారు. అవసరమైన వారికి వివిధ రకాల టెస్ట్‌ల కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశారని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ప్రతినిధులు గద్దె శేషగిరి, పి. సుజాతరావు, ఆంజనేయులు, మిరియాల వెంకటేశ్వరరావు, స్థానికులు కృష్ణయ్య, పిన్నమనేని మురళీకృష్ణ, గిరిజ, సుధ, కొండబాబు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

**మంగళగిరి టౌన్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి నగర పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో ఆదివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో పట్టణ వికాస తరంగిణి, మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, వీఐఏ కాల్పోస్కోపీ, పాప్‌స్మియర్ తదితర పరీక్షలను మహిళలకు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గిరిజ మాట్లాడుతూ మహిళలకు వైట్ డిస్‌చార్జి, ఎక్కువ బ్లీడింగ్, పిరియడ్స్ సరిగ్గా రాకపోయినా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయని, ఏడాదికి 75 వేల మహిళల్లో కొత్తగా క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయని చెప్పారు. 2040 సంవత్సరానికి 100 శాతం మహిళలకు స్క్రీనింగ్ టెస్టులు జరగాలని డబ్ల్యూహెచ్‌వో లక్ష్య మన్నారు. మహిళా ఆరోగ్య వికాస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రుక్మిణి, జిల్లా కో ఆర్డినేటర్ పద్మావతి, వికాస తరంగిణి పట్టణ అధ్యక్షులు చక్రవర్తి పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న వికాస తరంగిణి సభ్యులు, వైద్యులు

## హనుమంత వాహనంపై గ్రామోత్సవం

**కొల్లిపర:** కొల్లిపరలోని శ్రీదేవిభూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం జనార్దన స్వామి రామావతారం అలంకరణలో గ్రామస్తులను కటాక్షించారు. హనుమంత వాహనంపై గ్రామోత్సవానికి తరలివెళ్లారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు, పండ్లు, బియ్యం, హారతులు సమర్పించారు. ఆలయంలో తెల్లవారు జామున, సాయంత్రం వేద పండితులు స్వామి వారికి నిత్యహోమము, బలిహరణ, ఎదురుకోలోత్సవము, రాత్రి 9గంటలకు స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని గ్రామంలోని భక్తులు, మహిళలు తెల్లవారు జాము నుంచి పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని స్వామిని దర్శించుకుని విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పండితులు జగన్నాథాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృధ్వీబార్గవ్, వీరభద్రేశ్వర కోటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మ ఉన్నారు.

